# పరిచయము

మన కవి పిన్ననాఁట నుండి సంప్రదాయరీతులలోఁ బెరిఁగినవాఁడౌటచే భగవద్గీతాయోగవాసిష్ఠాది తత్త్వగ్రంథముల పట్ల మక్కువ గలవాఁడై యనుదినము జప మాచరించు నైష్ఠికుఁ డయ్యెను. వయస్సు మరలిన కొలఁది నీ భావమే కవిలో జీర్ణించి కావ్యానువాదరచనము నిలిపి తత్త్వగ్రంథములకుఁ గావ్యానువాదములు చేయుటకుఁ బురికొల్పినది. దాని ఫలితమే ప్రకృతకావ్యము. పిమ్మట యోగవాసిష్ఠమును బద్యాంధ్రీకరణముగఁ బ్రారంభించి కవి 1948 వ సం॥ లోఁ గాలధర్మ మొందుటచే నీ కృతికి నంతరాయము గల్గుటయే కాక— అపూర్వఫణితిని, గద్యపద్యాత్మకముగా రసాత్మకమౌనట్లు త్రిపురాన వంశమును గూర్చి చరిత్రరూపముగా వ్రాయఁబూనిన సంకల్పము కూడ నెఱవేఱదయ్యెను.

భగవద్గీతాతత్త్వగ్రంథానువాదములో మన కవి ప్రదర్శించిన ప్రతిభావ్యుత్పత్తులను గూర్చి "తొలిపలుకుల" యనంతరము విశేషించి యుగ్గడింపఁ బనిలేదు. ఈ కావ్యనిర్మాణమును గూర్చి రెండురెండు మాట లప్రస్తుతములు గావు. కృతికర్త

"తగదు తగ దిది పార్థ" (పుట ౧౮)

యను మకుటము గల భాగములతోఁ (8-4-1941 వ తేదీని) బ్రారంభించి, కావ్యారంభమును (౧౧ పుట మొదలు) 2-1-1942 వ తేదిని బూరించిరి. పంచమాధ్యాయము వఱకుఁ గల కావ్యభాగమును 27-1-1942 నాఁటికిఁ బూర్తిచేసిరి. 1942 ఫిబ్రవరి, మార్చినెలలలో రచనకు అవాంతరము గల్గెను. 2-4-1942 వ తేదినుండి పునారచన మారంభించి యచంచలదీక్షతో మాసాంతమునకుఁ గావ్యమును సమాప్త మొనరించిరి.

కవిగారు తమ వ్రాఁతప్రతిలో నేయే భాగముల నేయే వేళల వ్రాసి పూర్తిచేసికొనుచు వచ్చిరో వివరముగ నుటంకించియున్నారు. ఆయా వేళలనుబట్టి యించుమించు కావ్యనిర్మాణ మంతయు రాత్రి వేళల 12—4 గంటల నడిమికాలమున జరిగినట్లు తెల్ల మగును.

ఈ కవి రచనావిధానములలో నొక ప్రత్యేకవిశిష్టతకలదు. తాము పగ లంతయు నితరవ్యాసంగములలో నిమగ్నులై ప్రశాంతముగ రాత్రి వేళలఁ దమ సౌధోపరిభాగమున శయనించుచు, లేచి విహరించుచుఁ, దాము సంకల్పించిన కృతిని మనోగతముగానే నిర్మించి రూపొందించి యేదో యొక వేళకు నిద్రించెడువారు. ఉదయము లేచి రాత్రి యల్లిన తమ మనోమాత్రస్థితకావ్యభాగములను గాగితములపై కెక్కించెడివారు. ఇట్టి రచనావిధానమున వీరికిని ఆంగ్ల కవిశిఖామణి మిల్టనునకు సామ్యము కలదు. *

కాని యీ కృతిని ఱైవిధముగా మనోగతిని రూపొందించియు వెనువెంటనే రాత్రివేళలయందే కాగితములపై వ్రాసిపెట్టుచు వచ్చిరి — ఉదాహరణమునకు—

(i) "మానిత విజ్ఞానముతో" (౨౨ వ పుట) అను మకుటము గల యేడవ యధ్యాయమును 2-4-1942 వ తేది రాత్రి 12 గంటలకును,

(ii) "విజ్ఞానాన్విత మతిగోష్యంబే..." (౬౨ వ పుట) అను మకుటము గల తొమ్మిదవ యధ్యాయము 4-4-1942 వ తేది రాత్రి 2 గంటలకును

బూరించిరి. ఇట్లే దాదాపు కావ్య మంతయు రచింపఁబడిన దని వ్రాఁతప్రతివలనఁ దెలియుచున్నది.

ఈ కృతినే కాక మన కళాప్రపూర్ణుని యితరాముద్రితములను గూడఁ బ్రచురించుటలో వెనుబాటులేని దీక్షను జూపుచున్న సాధ్వీమణి, కవితల్లజుల యర్ధాంగి రామరత్నమ్మగారికి ఆంధ్రపాఠకలోకము కృతజ్ఞతాబద్ధమై యున్నది.

గుంటూరు
1-1-1954

ఎలవర్తి రోశయ్య, ఎం. ఏ.,
ఆవుల గోపాలకృష్ణమూర్తి

---

* మిల్టన్ తా నంధుఁ డగుటచే నేకాంతమునఁ గావ్యములను మనోవీథిని వినిర్మించుకొని తన కూఁతును మేల్కొలిపి యామెచే వ్రాయించెడి వాఁ డనుట ప్రఖ్యాతమే కదా!